క్లుప్తంగా

8న రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవినీతి సొమ్ము రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప కార్పొరేషన్‌లో చెత్త పన్నుతో పాటు కుక్కల ఆపరేషన్, ఫుట్పాత్ వసూళ్లు, మలేరియా విభాగంలో, టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అడిషనల్ వర్కర్ల వివాదం తదితర అంశాలపై చర్యలు లేకపోవడం సమంజసం కాదన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి నగరంలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, వ్యాపార సంస్థల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్‌కి అవార్డులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఏటా సెప్టెంబర్ 5 వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ ఉత్తమ సేవలకు గాను అవార్డులు ఇస్తారని, ఈ అవార్డులను ప్రైవేటు టీచర్స్‌తోపాటు లెక్చరర్లకు కూడా ఇవ్వాలని పీటీఎల్‌యూ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు డిమాండ్ చేశారు. కానీ కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మాత్రమే అని కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే టీచర్స్, లెక్చరర్స్ ఉత్తమ బోధన చేస్తున్నారని.. వారికి కూడా ఇవ్వాలని కోరారు. పాఠశాల విద్యా డైరెక్టర్ ప్రభుత్వంతో మాట్లాడి తగు విధంగా ఆదేశాలు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం

కడప ఎడ్యుకేషన్: కడప నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కడప మండలం విద్యాశాఖ అధికారులు హఫీజ్ రఫీక్ మహమ్మద్-1, షేక్ ఇర్షాద్ అహ్మద్-2 లు పేర్కొన్నారు. ఇటీవల కడప ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన హఫీజ్ రఫీక్ అహ్మద్ ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్‌తో కలిసి మంగళవారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న విద్యాశాఖ పథకాలతోపాటు విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయం సిబ్బంది, ఎంఐఎస్ కోర్డినేటర్, సీఆర్ఎంటిఎస్‌లు, మెసెంజర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగరం బిల్టప్ సర్కిల్ దగ్గరలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు భారత జాతీయ ప్రతిభ అన్వేషణ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ)పరీక్షల ఫలితాలలో ప్రతిభను చాటారు. ఈ ఫలితాలలో ఏడవ తరగతి విద్యార్థిని పి. యశస్విని గ్రాండ్ ప్రైజ్ ల్యాప్‌టాప్, పి.భార్గవ్ మొదటి బహుమతి ట్యాబ్, భవ్యశ్రీ , నంద కిశోర్ స్మార్ట్ వాచీలు మరియు వివిధ కేటగిరీలలో నూట యాభై మంది కి పైగా విద్యార్థులకి అనేక బహుమతుల తోపాటు మెడల్స్ సాధించారు. ఇందుకుగాను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో అభినందన సభను ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏ.జీ.యమ్ రమణయ్య మాట్లాడుతూ మా పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీ పరీక్షలు, ప్రతిభా పరీక్షలలో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్- ప్రిన్సిపాల్ ఓబయ్య , డీన్ రెడ్డి కుమార్, సి బ్యాచ్ ఇంచార్జి ఈశ్వరయ్య , ఒలింపియాడ్ ఇంచార్జి , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి రుద్రాభిషేకం

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అత్యంత భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు కర్నాటక, మహారాష్ట్రకు చెందిన 675 మంది రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు మూడు విభాలుగా వివిధ దశలుగా నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు శ్రీ భద్రకాళి అమ్మవారికి కుంకమార్చన కూడా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్యస్వామి, శేఖర్ స్వామి, రాచరాయ యోగీ స్వామి, మల్లికార్జున స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయంలో ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం

మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజా సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక 34వ డివిజన్‌లో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడుస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 99 శాతం వాగ్దానాలను అమలు చేసి దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా పేరుగాంచారన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు, నీకు రూ.18వేలు, నీకు రూ.18వేలు అంటూ ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం ఎంత బాకీ ఉందో ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన, నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి అని, మెగా డీఎస్సీ, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అని మోసపూరిత హామీలతో నట్టేట ముంచారన్నారు. ఏటా రూ.20 వేలు ఇస్తామని, 9 గంటల ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ నిధి అని రైతులను దారుణంగా మోసం చేశారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అని చెప్పి, ఇప్పటి వరకూ దాని ఊసే ఎత్తలేదన్నారు. ఇలా ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివప్రసాద్, నార్త్ జోన్ అధ్యక్షుడు ఇలియాస్ బీహెచ్, 34వ డివిజన్ ఇన్‌చార్జి అక్బర్ అలీ, రామ్మోహన్‌రెడ్డి, కరిముల్లా, సుభాన్‌బాషా, దేవిరెడ్డి ఆదిత్య, మునిశేఖర్‌రెడ్డి, జఫ్రుల్లా, ఏ1 నాగరాజు, పవర్ అల్తాఫ్, శ్రీరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సువర్ణావకాశం

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సువర్ణ అవకాశం జెడ్పీ ఉప ఎన్నికల ద్వారా ప్రజలకు వచ్చిందని వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్ అన్నారు. మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2024 ఎన్నికల సమయంలో ఉచిత మోసపూరిత వాగ్దానాలతో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలలు అవుతున్నా... ఒక పింఛన్ తప్పితే మరే హామీని సక్రమంగా అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం అరకొర అమలు చేసి ఆంక్షలు పెట్టారన్నారు. కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి, విపరీతంగా పెంచేశారన్నారు. మహిళలు, విద్యార్థులకు, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంలో పూర్తిగా శూన్యమన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రజలు ఉప ఎన్నికల ద్వారా ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేస్తే....ప్రభుత్వం మాకు ఇక అడ్డేలేదనే రీతిలో సంక్షేమ పథకాలు ఇవ్వకుండా అన్ని ధరలు పెంచేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి, ఒంటిమిట్ట అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలకు ఓటేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తల్లిపాలు అమృతం లాంటివి

కమలాపురం : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జయకుమారి తెలిపారు. మంగళవారం కమలాపురం సెక్టార్ పరిధిలోని కొలిమివీధి అంగన్‌వాడీ సెంటర్‌లో ఫస్ట్ సచివాలయం పరిధిలోని అంగన్‌డీలు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలపై తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. ఇలా పాలు తాపించడం వలన తల్లికి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మధు మేహం తదితర రోగాలు రాకుండా ఉంటాయన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజసిద్ధమైన టీకా అన్నారు. తల్లిపాల పట్ల ప్రతి తల్లి అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లులు తమ బిడ్డకు విధిగా పాలు ఇవ్వాలన్నారు. పండ్లు అధికంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు లక్ష్మీదేవి, వైష్ణవి, గౌసియా, తల్లులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : లక్ష్మీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నమాచుపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుర్రమ్మ, మహిళా పోలీస్ సునంద ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు, తల్లికి శ్రీరామరక్ష అన్నారు. బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు. బిడ్డకు తల్లిపాలు పట్టడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నిబంధనలు పాటించని, పీసీ నెంబర్లు లేని ఆటోలను స్టేషన్‌కు తరలించి ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఇన్‌స్రూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. ఎవరైనా లైసెన్స్ లేని డ్రైవర్లు ఉంటే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి పోలీసుశాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు అసాంఘిక కార్యకలాపాల, అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

చెత్త పన్ను అక్రమ వసూళ్లపై ప్రత్యేక విచారణ చేయాలి

- పాలకవర్గంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో చెత్త పన్ను అక్రమ వసూళ్లపై ప్రత్యేక అధికారితో విచారణ చేయాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, బాలస్వామిరెడ్డి, కె. బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, బసవరాజు, త్యాగరాజు, శ్రీరంజన్‌రెడ్డి తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 జూన్ నుంచి క్లాప్ ప్రోగ్రాంను కడప కార్పొరేషన్‌లో అమలు చేశారని, 2022 అక్టోబర్ 31న నిర్వహించిన జనరల్ బాడీలో ప్రజలు యూజర్ చార్జీలు రూ.90లు చెల్లించలేరని, రూ.40లు మాత్రమే వసూలు చేయాలని తీర్మాణం చేశామన్నారు. ఈ తీర్మాణాన్ని అప్పటి అధికారులు అమలు చేయలేదన్నారు. ప్రజల నుంచి వసూలు చేసే యూజర్ చార్జీలు తక్కువై క్లాప్ ఆటోల కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్ నుంచి చెల్లించిన సందర్భాలు ఉన్నాయన్నారు. క్లాప్ ప్రోగ్రాం మొత్తం అప్పటి కమిషనరైన ఐఏఎస్ ప్రవీణ్‌చంద్ నేతృత్వంలో సాగిందన్నారు. పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అప్పుడు క్లాప్ ప్రోగ్రాంలో యూజర్ చార్జీల వసూళ్లలో అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు ఇప్పుడు ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. అప్పుడు అవినీతి జరిగి ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎందుకు విచారణ చేయలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేయవద్దని చెప్పినా, నగరపాలక అధికారులు చెత్త పన్ను అక్రమంగా వసూలు చేశారని...దీన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు గతంలో అవినీతి జరిగిందని చెబుతున్నారన్నారు. అడిషనల్ కమిషనర్ ఆధ్వర్యంలోనే ఈ అక్రమ వసూళ్లు జరిగాయని, వెంటనే ఆయన్ను విధుల నుంచి తప్పించి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అధికారపార్టీకి తొత్తుగా పనిచేస్తున్నందునే అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రను జూన్ 9న మైదుకూరుకు బదిలీ చేసినప్పటికీ ఇంకా కొనసాగిస్తున్నారన్నారు. రాజీవ్ పార్కు ఎదుట ఏర్పాటు చేసిన స్టాల్స్, తోపుడు బండ్ల నుంచి చేస్తున్న బాడుగల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయన్నారు. నెలక్రితమే వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీలు జరిగాయని, అంతలోనే అందరినీ డిప్యూటేషన్‌పై ఇదివరకున్న స్థానాలకే బదిలీలు చేయడం దారుణమన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయాలన్నారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయాలి

- పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి
- జేసీకి ఏపీయూడబ్ల్యూజే నాయకుల వినతి

కడప సెవెన్‌రోడ్స్ : వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు జారీ చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్త కోర్కెల దినంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యుడు రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎం.బాలకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ కొత్త అక్రిడిటేషన్ల జారీలో అనవసర జాప్యం తగదన్నారు. అక్రిడిటేషన్ లేకపోవడం వల్ల జర్నలిస్టులు పలు సదుపాయాలు పొందలేకపోతున్నారని తెలిపారు. కనీసం హెల్త్‌కార్డు పొందే అవకాశం కూడా కోల్పోవాల్సి వస్తోందన్నారు. అక్రిడిటేషన్ నియమాలు సవరించి వర్కింగ్ జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు జారీ చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు కొత్త జీఓ విడుదల చేయకపోవడం విచారకరమన్నారు. ఈ ఏడాదిలోనే పాత అక్రిడిటేషన్ల గడువును ఇప్పటికి మూడుసార్లు పొడిగించారని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీకి గడువు ముగుస్తుందని, మరోమారు గడువు పొడిగించకుండా అర్హులకు కొత్త అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌కార్డు పథకంలోని లోపాలను సవరించి దాన్ని మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సమాచారశాఖ, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న జర్నలిస్టులకు పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా పెన్షన్ పథకాన్ని ప్రారంభించాలన్నారు. అలాగే ప్రమాద బీమా పథకాన్ని పునః ప్రారంభించాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు బీవీ నాగిరెడ్డి, వెంకటరెడ్డి, మన్నెం శివరాం, రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా స్టాల్స్ పెట్టుకోవాలి

కడప కార్పొరేషన్: ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ, ట్రాఫిక్ సీఐ జావేద్‌లతో కలిసి ఆయన రాజీవ్ పార్కు ప్రాంతాన్ని పరిశీలించారు. రాజీవ్ పార్కు ఎదుట గతంలో తోపుడుబండ్లు, బంకులను సాయంత్రం ఏర్పాటు చేసి 9 గంటల తర్వాత తొలగించేవారు...కూటమి ప్రభుత్వం వచ్చాక పర్మినెంట్‌గా ఏర్పాటు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై 'సాక్షి' రెండు సార్లు కథనాలు ప్రచురించింది. వీకెండ్ రోజుల్లో ఈ ట్రాఫిక్ రద్దీ ఎక్కువవుతుండటంతో ఇటీవల ట్రాఫిక్ డీఎస్పీతో పాటు, ప్రజల నుంచి కూడా అభ్యంతరాలు రావడంతో ఎట్టకేలకు కమిషనర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో దీనిపై ప్రణాళిక సిద్ధం చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



రాజీవ్ పార్కు వద్ద పోలీసు అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

స్మార్ట్ మీటర్ల రద్దు కోసం ఉద్యమిస్తాం

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన ఇంధన సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలని సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు చంద్ర, బి మనోహర్, నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విద్యుత్ భవన్ ఎదుట ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే ఆపకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెరవేసే టైం ఆఫ్ డే టార్ఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రామ్మోహన్, రమణయ్య, దస్తగిరి రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాదుల్లా, మద్దిలేటి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలి

రాష్ట్రవ్యాప్తంగా అమలు కాబోతున్న స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం ఆపాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని యువగళంలో పిలుపునిచ్చిన నారా లోకేష్ ఇప్పుడు ఎందుకు సమర్థిస్తున్నట్లు అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల వలన అన్ని తరగతుల ప్రజానీకానికి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రమణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ఎదుట నిరసన చేపడుతున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. అలాగే రానున్న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అభిషేకం, చండీహోమం, 108 దీపాలతో దీపాలంకార సేవ, ఆదివారం ఉదయం శ్రీ విజయ దుర్గా మల్లికార్జున స్వామివారి కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



వైవీయూలో ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలో భాగంగా డెమో ఇస్తున్న అభ్యర్థి

కడప ఎడ్యుకేషన్: వైవీయూలో ఎంబీఏ శాఖలో గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం కోసం సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య టి శ్రీనివాస్ మార్గదర్శకంలో ఇంటర్వ్యూలు కొనసాగాయి. సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ గా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ విద్యపీట్ ఎంబీఏ విభాగ ప్రొఫెసర్ జి శ్రీధర్ హాజరు కాగా, వైవీయూ ప్రొఫెసర్ ఏజీ దాము, కామర్స్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ వై సుబ్బరాయుడు, ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ పి. సరిత, డాక్టర్ గంగయ్య ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలలో అభ్యర్థుల మైక్రో టీచింగ్‌ను, అకడమిక్ ప్రతిభను పరిశీలించారు. విద్యార్థుల మార్కులను పరిగణలోకి తీసుకొని ఎంపికైన వారి జాబితాను ప్రకటిస్తామని వారు తెలిపారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న కడప డీఎం డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర చర్యలు చేపట్టనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని డీఎం కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడప డిపోకు సంబంధించిన గాలివీడు సర్వీసు గాలివీడు నుంచి కడపకు వచ్చే టైమింగ్స్ 5.45 నుంచి 4.15కు మార్చాలని కోరారు.

- విధి నిర్వహణ సమయంలో కండక్టర్లు మర్యాద పూర్వకంగా వ్యవహరించేలా చూడాలని, స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు నిదానంగా నడిపేలా చూడాలని కోరారు.
- దివ్యాంగుల సీట్లలో ఇతరులు కూర్చొంటే వారి సీట్లను తిరిగి దివ్యాంగులు వచ్చిన తర్వాత వారికి కేటాయించడంలో కండక్టర్లు చొరవచూపేలా ఆదేశించాలన్నారు.

అయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఎం తెలియజేశారు.

డ్రగ్ రహిత సమాజమే లక్ష్యం



డ్రగ్స్‌కు సంబంధించిన కరపత్రాలను చూపుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్రియాశీలక పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు సూచించారు. మంగళవారం కడప శ్రీసాయి జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర డ్రగ్స్ కట్టడి చేయడం కోసం ఈగల్ పేరుతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఇళ్లు, పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, గంజాయి విక్రయాలు జరుగుతూ ఉంటే సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారాన్ని తెలియ చేయాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో మాదక ద్రవ్యాల నివారణలో భాగస్వాములవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్‌రెడ్డి, నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ హెడ్ కానిస్టేబుల్ అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

కడప రూరల్ : గ్రామ స్థాయి నుంచి బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప తెలిపారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయుల ఆశయాల సాధన బీఎస్పీతోనే సాధ్యమన్నారు. నిరంతరం పీడిత వర్గాల కోసం పోరాటం చేసే పార్టీ బీఎస్పీ అని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి బాలచంద్ర, ప్రధాన కార్యదర్శి బేబి, ఉపాధ్యక్షులు చంద్ర, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి పలుకూరి ఏసోబు, ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షులు కిరణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయాన్ని వైవీయూ వీసీ ఆచార్య శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. గ్రంథాలయ నిర్వహణ గురించి అక్కడున్న సిబ్బంది ఆయనకు వివరించారు. వసతులు, సౌకర్యాలు, పుస్తకాలు ఇంకా ఏమైనా అవసరాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.